సాక్షి
పెద్దపల్లి
శనివారం । 24 । జూన్ । 2023



'పీఎం శ్రీ'కి ఐదు పాఠశాలలు

భావి భారత పౌరులను భవిష్యత్తు పోటీ ప్రపంచానికి సన్నద్ధం చేసే లక్ష్యంతో పీఎం శ్రీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. నూతన జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే దీని లక్ష్యం. 10లో



జీఎంను కలిసిన కేవీకే సిబ్బంది

కమాన్‌పూర్: ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావును రామగిరి కృషి విజ్ఞాన కేంద్రం ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కరీంనగర్ నాబార్డ్ ఏజీఎం జయప్రకాష్ శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
33.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

అసంతృప్తా.. అవిశ్వాసమా..!

- రామగుండం కార్పొరేటర్ల రహస్య సమావేశం దేనికి సంకేతం..?
- మేయర్‌కు వ్యతిరేకంగా సమావేశంలో ఘాటుగా చర్చ
- అభివృద్ధి పనుల కోసమే అంటూ దాటవేసిన పలువురు కార్పొరేటర్లు
- అవిశ్వాస తీర్మానంపై ఎమ్మెల్యే కోరుకంటి విముఖత



రామగుండం కార్పొరేషన్ కార్యాలయం

సాక్షి, పెద్దపల్లి: రామగుండం కార్పొరేషన్‌లోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు రహస్య సమావేశంలో పాల్గొని మేయర్ పనితీరుకు వ్యతిరేకంగా మాట్లాడుకున్న విషయం చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో డిప్యూటీ మేయర్‌తో పాటు 23 మంది కార్పొరేటర్లు సమావేశమయ్యారు. తమ డివిజన్లలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడంలో జాప్యం చేయడంతో పాటు పలు విషయాలపై మేయర్ సహకరించడం లేదని ప్రధాన ఆరోపణగా పలువురు అధికార పార్టీ కార్పొరేటర్ల సమావేశం కొనసాగింది. సమావేశం జరుగుతున్న సమయంలోనే ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మేయర్ అనిల్ కుమార్ హైదరాబాద్‌లో ఉన్నారు.

అంతుపట్టని సమావేశం

అసమ్మతి కార్పొరేటర్లు, ఇతర పార్టీల నుంచి వచ్చిన కొందరు మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సమావేశం ఏర్పాటు చేశారా లేదా అభివృద్ధి పనుల జాప్యంపైనా అని తెలియకుండా ఎవరికి వారే పలు విధాలుగా ఊహించుకుంటున్నారు. గురువారం పాలక మండలి సమావేశం జరగడం, తెల్లవారే ఇలా రహస్య సమావేశం నిర్వహించడంలో ఉన్న ఆంతర్యం అంతుపట్టడం లేదు. ఈనేపథ్యంలో రామగుండం కార్పొరేటర్లు నిర్వహించుకున్న సమావేశం మేయర్‌పై అసంతృప్తా.. లేక అవిశ్వాసం దిశగా అడుగులు వేస్తున్నారా అంటే.. కొద్దిరోజులుగా కార్పొరేషన్‌లో జరుగుతున్న రహస్య సమావేశాలు, ఫోరంగా ఏర్పడటం, బహిరంగంగానే మేయర్‌పై విమర్శలు గుప్పించటం చూస్తుంటే మేయర్ సీటుకు ముప్పువాటిల్లేందుకు అవకాశాలు ఎక్కువ ఉన్నాయని రాజకీయ నిపుణులు అంచనా వేస్తున్నారు.

గత పాలకవర్గంలో నెగ్గిన అవిశ్వాస తీర్మానం

రామగుండం కార్పొరేషన్‌లో సోమారపు సత్యనారాయణ ఎమ్మెల్యే ఉన్నప్పుడు గత పాలకవర్గ సమయంలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి మేయర్ కొంకటి లక్ష్మీనారాయణను పదవి నుంచి దింపి జాలి రాజమణికి పదవి కట్టబెట్టారు. అప్పుడు ఎమ్మెల్యే సత్యనారాయణ ప్రోద్బలంతోనే అవిశ్వాస తీర్మానం పెట్టి నెగ్గిపించారు. కాగా ప్రస్తుతం మేయర్ పనితీరుపై ఎమ్మెల్యే చందర్ సైతం అసంతృప్తిగానే ఉన్నా, అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో కార్పొరేషన్‌లో అవిశ్వాస తీర్మానం పెట్టడం రాజకీయంగా పెనుదుమారం రేపే అవకాశం ఉండటంతో అవిశ్వాసంపై ఎమ్మెల్యే విముఖత చూపుతున్నట్లు తెలుస్తోంది. మేయర్‌గా ఎన్నికైన అనిల్ కుమార్ పనితీరుపై అనేక విమర్శలున్నాయి. కాగా ఎమ్మెల్యే చందర్ రామగుండంకు వచ్చిన తర్వాత మేయర్ తీరుపై అసంతృప్తిగా ఉన్న కార్పొరేటర్లు సమావేశ వివరాలు ఆయనకు తెలియజేసి, తుది నిర్ణయం ఎమ్మెల్యేకు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

11మందితో కార్పొరేటర్స్ ఫోరం

రామగుండం కార్పొరేషన్‌లో 50 డివిజన్లు ఉండగా 2020లో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్ పార్టీ 18 సీట్లు, కాంగ్రెస్ 11, బీజేపీ 6, ఫార్వర్డ్ బ్లాక్ 9, స్వతంత్రులు ఆరుగురు గెలుపొందారు. అయితే బీఆర్ఎస్ పార్టీ మేయర్ అభ్యర్థిగా డాక్టర్ అనిల్‌కుమార్ బీజేపీ నుంచి 3, కాంగ్రెస్ నుంచి ఒక్కరు, స్వతంత్రులు, ఫార్వర్డ్ బ్లాక్‌కు చెందిన మొత్తం 37మంది అభ్యర్థుల మద్దతుతో ఎన్నికయ్యారు. అనిల్‌కుమార్ మేయర్‌గా ఎన్నికైననాటి నుంచి కార్పొరేటర్స్‌ను పట్టించుకోకపోవడం, తాను సొంతంగా కొంతమంది కార్పొరేటర్స్‌తోనే సన్నిహితంగా ఉండటంతో చాలా సార్లు అధికార పార్టీ కార్పొరేటర్స్ మేయర్‌కు వ్యతిరేకంగా సమావేశమై బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. ఇటీవల తమ డివిజన్స్‌లో అభివృద్ధి పనుల ఆలస్యం, తదితర సమస్యల పరిష్కారానికి 11మంది 'కార్పొరేటర్స్ ఫోరం' అని మేయర్‌కు వ్యతిరేకంగా ఏర్పాటు చేశారు. నూతన మున్సిపల్ చట్టం ప్రకారం అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే కనీసం మూ డేళ్ల పదవీకాలం పూర్తికావాల్సి ఉంది. దీంతో ఇన్ని రోజులు ఆగిన అసంతృప్తులు నేడు ఎమ్మెల్యే, మేయర్ లేని సమయంలో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవడం హాట్‌టాపిక్‌గా మారింది.

సీపీఆర్ చేశారు.. ప్రాణం నిలిపారు



లింగయ్యకు సీపీఆర్ చేస్తున్న 108 సిబ్బంది

ఓదెల(పెద్దపల్లి): వృద్ధుడికి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు 108 సిబ్బంది. వివరాలు.. ఓదెల మండలం కనగర్తి గ్రామానికి చెందిన పెరక లింగయ్య (78) గురువారం అర్ధరాత్రి అస్వస్థతకు గురికాగా శ్వాస సమస్య తలెత్తింది. వెంటనే కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి సమాచారం అందించగా, సుల్తానాబాద్ ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యపరీక్షలు చేసిన అనంతరం పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌కు తరలించే ప్రయత్నంలో లింగయ్య అపస్మారకస్థితిలోకి వెళ్లడంతో పాటు శ్వాస ఆగిపోయింది. వెంటనే కాల్ సెంటర్‌లోని వైద్యుల సూచనల మేరకు రోగికి సీపీఆర్ చేయగా, స్పృహలోకి రావడంతో పాటు పల్స్ పెరిగింది. ఈసందర్భంగా 108 సిబ్బందికి లింగయ్య కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. రోగికి సీపీఆర్ చేసిన పైలెట్ మదన్‌మోహన్, ఈఎంటీ శ్రీనివాస్‌ను కరీంనగర్ వైద్యులు అభినందించారు.

ఆలయాల భూములకు హద్దులు గుర్తింపు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మండల కేంద్రంతోపాటు పొత్కపల్లి గ్రామంలోని ఆలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ సర్వేయర్ పసునూరి అనిల్ శుక్రవారం హద్దులు గుర్తించారు. పొత్కపల్లి గ్రామంలోని రాజగోపాలస్వామి, ఓదెల గ్రామంలోని సీతారామచంద్రస్వామి, ఆంజనేయస్వామి, శంభులింగేశ్వరస్వామి ఆలయాల విస్తీర్ణం హద్దులను కొలిచారు. సర్పంచులు ఆళ్ల రాజిరెడ్డి, ఆకుల ఉదయదేవి, ఈవో సదయ్య పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్‌ను కలిసిన ఆర్జీ–3 జీఎం



పూలమొక్క అందిస్తున్న జీఎం

కమాన్‌పూర్(రామగిరి): ఆర్జీ–3 జీఎంగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్.సుధాకర్‌రావు శుక్రవారం అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు. ఈసందర్భంగా ఆర్జీ–3 ఏరియాలో గనుల విస్తరణ కోసం రెవెన్యూ పరంగా ఉన్న పనులకు సంబంధించి సంస్థకు సహకారం అందించాలని కోరారు. జీఎం వెంట సీనియర్ ఎస్టేట్ అధికారి ఐలయ్య, ఎస్ఎస్‌వో లక్ష్మీనారాయణ ఉన్నారు.

రామగుండం ఎన్టీపీసీకి అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న ఈడీ సునీల్‌కుమార్

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టుకు ఎనర్జీ ఎఫిషియెన్సీలో గోల్డెన్ పీకాక్ అవార్డు–2023 వరించింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐవోడీ) బెంగళూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్‌తో పాటు ఏజీఎం అశుతోష్ కుమార్, సీనియర్ మేనేజర్ వంశీ కృష్ణ ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్నారు. దేశంలో అతిపెద్ద 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయగల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటు, మియావాకి చిట్టడవి పెంపకంతో పాటు ప్రాజెక్టులతో ఇంధన సామర్థ్యం, గ్రీన్ ఎనర్జీ, సీవో2 ఉద్గారాల తగ్గింపులో చేపట్టిన కార్యక్రమాలకుగాను ఎన్టీపీసీ అవార్డుకు ఎంపికైంది. ఈసందర్భంగా గత నాలుగేళ్లలో ఎన్టీపీసీ మూడోసారి అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని ఈడీ పేర్కొన్నారు.

'లక్ష సాయం' దరఖాస్తుల పరిశీలన



లబ్ధిదారుల పత్రాలను పరిశీలిస్తున్న బిల్ కలెక్టర్

కోల్‌సిటీ(రామగుండం): రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన బీసీలకు రూ.లక్ష ఆర్థికసాయం పథకానికి దరఖాస్తు చేసుకున్న వారికి వివరాలను రామగుండం నగరపాలక సంస్థ అధికారులు సేకరిస్తున్నారు. ఈ పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న సుమారు 1,300 మంది జాబితా నగరపాలక సంస్థకు వచ్చింది. ఇందులో అర్హులను గుర్తించేందుకు వివరాలు సేకరించాలని, నగరపాలకలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లను మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు ఆదేశించారు. దీంతో శుక్రవారం నుంచి బిల్‌కలెక్టర్లు దరఖాస్తు చేసుకున్న వారిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పుడు సమర్పించిన పత్రాలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఈనెల 26లోగా పత్రాల పరిశీలన ప్రక్రియ పూర్తి చెయ్యాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారు.

న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం వెంటనే నెరవేర్చాలని కాంట్రాక్టు కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రాజెక్టు లేబర్ గేట్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్మికుల సహనాన్ని పరీక్షించవద్దని సూచించారు. గతంలో చేసుకున్న అగ్రిమెంట్‌ను కూడా యాజమాన్యం పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ఒప్పందం అమలుచేయాలని రోజూ లేబర్ గేట్ వద్ద గంటపాటు కార్మికులతో నిరసన కార్యక్రమాలను వివిధ రూపాల్లో చేపడుతున్నట్లు తెలిపారు. కాంట్రాక్టర్లతో కార్మికులను రెచ్చగొట్టేలా ప్రకటనలు ఇప్పిస్తూ, కార్మికులు పోరాటాలు చేస్తే కేసులు బనాయించడం జరుగుతుందని హెచ్చరికలు జారీ చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తే ఈ నెల 30 తర్వాత కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు. సమావేశంలో నాయకులు చిలుక శంకర్, నాంసాని శంకర్, సత్యనారాయణ, బుచ్చన్న, సత్యం, ఇజ్జగిరి భూమయ్య, రాజిరెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

జీఈఎం పోర్టల్ ద్వారానే కొనాలి

- 15వ ఆర్థిక సంఘం నిధులపై కేంద్రం నిఘా
- అక్టోబర్ 2 నుంచి అమలుకు నిర్ణయం



పెద్దపల్లిరూరల్: స్థానిక సంస్థలకు కావాల్సిన సామగ్రిని 15వ ఆర్థిక సంఘం ద్వారా ఇస్తున్న నిధులతో అక్టోబర్ 2 నుంచి జీఈఎం (గవర్నమెంట్ ఈ మార్కెట్) వైబ్‌సైట్ ద్వారానే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో 15వ ఫైనాన్స్ నిధుల వినియోగంపై కేంద్ర ప్రభుత్వం నిఘా ఉంచనుంది. పంచాయతీరాజ్ విభాగంలో స్థానిక సంస్థలైన గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లు వచ్చే అక్టోబర్ 2 నుంచి 15 ఆర్థిక సంఘం నిధుల ద్వారా జరిపే కొనుగోళ్లన్ని కేంద్రం పరిధిలోని జీఈఎం వెబ్‌సైట్ ద్వారానే చేపట్టాలని తాజాగా ఆదేశాలు జారీ చేసింది. కొనుగోలు ఎవరి పేరిట జరగాలో నిర్దేశించడంతో పాటు నగదురహిత, పారదర్శకత లావాదేవీలను ప్రోత్సహించేందుకు ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చామని కేంద్రం పేర్కొంటోంది. అయితే పంచాయతీల్లో సామగ్రి కొనుగోళ్ల వివరాలను ఆరా తీసేందుకేనని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు.

నిధులు పక్కదారి పట్టకుండా ఉండేందుకేనా..

ప్రస్తుతం స్థానిక సంస్థలకు జనాభా ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తోంది. ప్రస్తుతం వీటిని గ్రామాల్లో పారిశుధ్యం, అభివృద్ధి పనుల అవసరాల కోసం వినియోగిస్తున్నారు. ఇప్పటివరకు ఈ నిధుల వినియోగంపై ఎవరి పర్యవేక్షణ లేదు. కేంద్రం తాజా ఆదేశాల మేరకు అక్టోబర్ 2నుంచి జీఈఎం పోర్టల్ ద్వారా చేపట్టే కొనుగోళ్ల వివరాలు కేంద్రానికి చేరుతాయి. పంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్ తదితర సామగ్రి కొనుగోళ్లు జీఈఎం వెబ్‌సైట్ ద్వారానే జరపాల్సి ఉంటుంది. రూ.25 వేల వరకు నేరుగా కొనుగోలు చేసుకోవచ్చు. రూ.25 వేలు మించి లక్ష వరకు తక్కువ ధరకు విక్రయించే సంస్థల వద్ద కొనాల్సి ఉంటుంది. రూ.5 లక్షల కంటే ఎక్కువ విలువగల వస్తువులను బిడ్డింగ్ ద్వారా కొనుగోలు చేయాలి.

ప్రజాప్రతినిధుల పేరిట..

గ్రామపంచాయతీల్లో సర్పంచులు, ఉపసర్పంచ్, మండల పరిషత్‌లో ఎంపీపీ, ఎంపీడీవోలు, జిల్లా పరిషత్‌లో జెడ్పీ చైర్మన్లు, సీఈవోల పేరిటనే కొనుగోలు జరగాల్సి ఉంటుంది. జీఈఎం పోర్టల్ ద్వారా కొనుగోళ్లకు సంబంధించి వివరాలను నేరుగా కేంద్రం పరిశీలించనున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై ఇప్పటికే జిల్లాల డీపీఎంలు హైదరాబాద్‌లో శిక్షణ పొందారు.

> **నిధులు పారదర్శకంగా వినియోగించేందుకే..**
>
> కేంద్రం అందిస్తున్న నిధులు పారదర్శకంగా వినియోగించుకునేందుకే అక్టోబర్ 2 నుంచి జీఎంఈ పోర్టల్ ద్వారా కొనుగోళ్లు జరగనున్నాయి. ఈ విషయమై డీపీఎంలు హైదరాబాద్‌లో శిక్షణ పొందారు. జిల్లాలోని సర్పంచ్, కార్యదర్శులకు అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తాం.
>
> – చంద్రమౌళి, డీపీఓ

పేదల గుడిసెలు తొలగిస్తే ఊరుకోం



ఇందిరమ్మకాలనీలో పేదలు వేసుకున్న గుడిసెల ప్రాంతాన్ని సందర్శిస్తున్న నాయకులు

- ప్రజా సంఘాల ఐక్య వేదిక బస్సు యాత్ర బృందం కన్వీనర్ వీరయ్య

జ్యోతినగర్(రామగుండం): నిరుపేదలకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని తెలంగాణ ప్రజా సంఘాల ఐక్య వేదిక బస్సుయాత్ర బృందం కన్వీనర్ ఎస్.వీరయ్య అన్నారు. శుక్రవారం రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మకాలనీ సమీపంలో ప్రభుత్వ స్థలంలో గుడారాలు వేసుకున్న పేదలను కలిసి సీపీఎం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు స్కైలాబ్‌బాబు, వీరయ్య, మల్లు లక్ష్మి మాట్లాడారు. పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామన్న ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదని, ఈ క్రమంలో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని ఉంటున్నారని, వారిని బెదిరించి గుడిసెలు తొలగిస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. భూకబ్జాదారులపై చూపని ప్రతాపం పేదలపై చూపడం సరికాదన్నారు. పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేసేవరకు పోరాటం ఆగదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, ప్రజా నాట్య మండలి కార్యదర్శి వేముల ఆనంద్, జగదీష్, పద్మ, యాకయ్య, ఏ.ముత్యంరావు, ఎం.రామాచారి, గీట్ల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

రెగ్యులర్ అధికారిని నియమించాలని వినతి



హైకోర్టు న్యాయమూర్తికి వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

ధర్మారం(ధర్మపురి): మండలంలోని నందిమేడారం జూనియర్ సివిల్ కోర్టుకు రెగ్యులర్ జ్యుడీషియల్ అధికారిని నియమించాలని శుక్రవారం స్థానిక న్యాయవాదులు హైకోర్టు న్యాయమూర్తులను కలిసి వినతిపత్రం అందజేశారు. న్యాయవాదులు నార అశోక్‌రెడ్డి, గాగిరెడ్డి మల్లారెడ్డి ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయమూర్తి పొనుగోటి నవీన్‌రావు, ఏఎస్‌పీ శ్రావణ్‌కుమార్, వేణుగోపాల్‌తో పాటు రిజిస్ట్రార్ జనరల్‌ను కలిసి వినతిపత్రం అందించినట్లు న్యాయవాది ఈదుల ప్రదీప్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు గడ్డం లింగారెడ్డి, లక్ష్మీనారాయణ, నూనె సత్యనారాయణ, ఎంపెల్లి ప్రకాష్, ఆకారి రాజేశం ఉన్నారు.

'ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి'



సీజ్‌చేసిన బుక్‌స్టాల్ వద్ద ఏబీవీపీ నాయకులు

పాలకుర్తి(రామగుండం): పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫామ్ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అజయ్ డిమాండ్ చేశారు. పాలకుర్తి మండలం జీడీనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని యూనివర్సల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల యాజమాన్యం ఎలాంటి అనుమతి లేకుండా పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, స్టేషనరీ అమ్ముతున్నారనే సమాచారం మేరకు సంబంధిత బుక్‌స్టాల్‌ను ఏబీవీపీ నాయకులు శుక్రవారం సందర్శించి అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన ఎంఈవో సంపత్‌రావు సిబ్బందితో బుక్‌స్టాల్‌ను సీజ్ చేయించారు. ఈసందర్భంగా అజయ్ మాట్లాడుతూ, జిల్లాలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలతో పాటు నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల ప్రాంగణాల్లో బుక్‌స్టాల్స్ నిర్వహిస్తున్న వారిపై విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తరుపున ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారం సందీప్, సోషల్ మీడియా కన్వీనర్ శ్రీపతి సాయితేజ, అరవింద్, అభి పాల్గొన్నారు.

పార్కింగ్.. పరేషాన్



బస్టాండ్ చౌరస్తాలో హోటళ్ల ఎదుట వాహనాల రద్దీ

పెద్దపల్లిరూరల్: రోడ్లపై తిరిగే వాహనాల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. వాహనదారులు తమ అవసరాలకోసం దుకాణాలు, బ్యాంకులు, ఆసుపత్రులకు వస్తే వాహనం ఎక్కడ పార్కింగ్ చేయాలోనని పరేషాన్ అవుతున్నారు. పోలీసులు జెండా కూడలిలో పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన స్థలం ఎటూ సరిపోక రోడ్లపైనే వాహనాలను నిలుపుతున్నారు. దీనికి తోడు దుకాణాలు నిర్వహించే వ్యాపారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి రోడ్లపైకి రావడంతో వాహనాలను నిలపడం మరీ కష్టంగా మారింది. జిల్లా కేంద్రమైన పెద్దపల్లి పట్టణంలోని మేన్‌రోడ్, కమాన్, బస్టాండ్ ప్రాంతాలతో పాటు బ్యాంకులు, ఆసుపత్రుల వద్ద ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది.

ఆటోల అడ్డాకు అగచాట్లే..

పెద్దపల్లి నుంచి పలు గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు ఆటోలు, సొంత వాహనాలపైనే ఆధారపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలనుంచి ప్రయాణీకులను తీసుకొచ్చే ఆటోలు అడ్డాల వద్ద నిలిపేందుకు ఇబ్బందులే ఉన్నాయి. పార్కింగ్ కోసం అవసరమైన స్థలం లేకపోవడంతో రోడ్లపైనే ఆపుతున్న ఆటోలను పోలీసులు తీయాలంటున్నారని ఆవేదన చెందుతున్నారు. కమాన్‌ప్రాంతంలో రాజీవ్‌రోడ్డు పై ఉన్న బ్యాంకు వద్ద, బస్టాండ్ సమీపంలోని హోటళ్ల వద్ద పార్కింగ్ సమస్య ఎక్కువగా ఉంది.

ఫొటోలు తీసి చలాన్లు..

వాహనదారులు రోడ్ల పక్కన ఛాయ్ తాగేందుకు వాహనాన్ని నిలపగానే ట్రాఫిక్ పోలీసులు మాట్లాడకుండా ఫొటో తీసి చలాన్ పంపిస్తున్నారని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. వాహనాలు నిలిపేందుకు స్థలం లేక పోవడంతోనే తాము కొద్దినిమిషాలకోసం ఆపినా జరిమానా చెల్లించాల్సి వస్తోందంటున్నారు. ప్రధాన కూడళ్లతో పాటు ద్విచక్రవాహనంపై పోలీసులు తిరుగుతూ ఫొటోలు తీస్తుండడంతో వారిని గమనిస్తూ వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి.

> **మున్సిపల్ సహకారంతో..**
>
> పట్టణంలో పార్కింగ్ సమస్య తలెత్తకుండా వాహనాదారులు సహకరించాలి. జెండా వద్ద ఏర్పాటు చేసిన స్థలంలో నిలపాలి. రోడ్లు ఆక్రమించిన వ్యాపారులపై మున్సిపల్ అధికారుల సహకారంతో చర్యలు తీసుకుంటాం. – మహేందర్, ఎస్సై, పెద్దపల్లి

సంస్థ ద్వారా సహకారం అందించండి



డైరెక్టర్‌కు మొక్క అందిస్తున్న మంత్రి, జెడ్పీ చైర్మన్

మంథని: హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో డైరెక్టర్ బలరాంనాయక్‌ను శుక్రవారం రాత్రి మంత్రి కొప్పుల ఈశ్వర్, జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు కలిశారు. ఈ సందర్భంగా అత్యధికంగా సింగరేణి ప్రభావిత గ్రామాలు ఉన్న మంథని నియోజకవర్గానికి సంస్థ ద్వారా సహకారం అందించాలని కోరారు. ఈ ప్రాంతంలోని సింగరేణి ప్రభావిత గ్రామాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సంస్థ మనుగడ కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు అండగా నిలవాలని కోరారు.

క్లుప్తంగా

హర్షితకు ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రం అందిస్తున్న నిట్ ప్రొఫెసర్లు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగిరి మండలంలోని చందనాపూర్ ప్రభుత్వ పాఠశాల పదోతరగతి విద్యార్థిని డి.హర్షిత ఇన్‌స్పైర్ మెంటరింగ్ వర్క్‌షాప్‌నకు వరంగల్ నిట్‌లో శిక్షణ పొందింది. జనవరి 9 నుంచి 11 వరకు నిర్మల్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఆమెతోపాటు జాతీయ స్థాయికి ఎంపికైన 26 మందికి ఈ నెల 22, 23 తేదీల్లో నిట్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. టీచర్ సంపత్ కుమార్‌తో కలిసి హర్షిత హాజరైంది. నిట్ ప్రొఫెసర్లు రామచంద్రయ్య, సంపత్ కుమార్, బిద్యాధర్ సుబిద్ధి, లక్ష్మారెడ్డిలు హర్షిత తయారు చేసిన స్టూడెంట్ ఫ్రెండ్లీ వాటర్ బాటిల్ అనే ప్రాజెక్టు ప్రదర్శనకు మెరుగైన సలహాలు, జాతీయ స్థాయిలో రాణించేందుకు మెలకువలపై శిక్షణనిచ్చి, శుక్రవారం ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన హర్షితతోపాటు గైడ్ టీచర్ సంపత్ కుమార్‌లను జిల్లా విద్యాధికారి మాధవి, ఎంఈవో సంపత్‌రావు, హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

వదినపై మరిది దాడి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వలలో నర్ల స్వరూపపై దాడి చేసిన ఆమె మరిది మేకల దుర్గయ్యపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పెద్దకల్వలకు చెందిన దుర్గయ్య కొంతకాలంగా తన భార్య రజితతో తరచూ గొడవ పడుతూ ఆమెను కొడుతున్నాడు. అదే గ్రామానికి చెందిన రజిత సోదరి స్వరూప అడ్డువెళ్లి, దుర్గయ్యను పలుమార్లు నిలదీసింది. శుక్రవారం మళ్లీ రజితను కొడుతుండటంతో స్వరూప అడ్డువెళ్లగా ఆమెపై కర్రతో దాడి చేశాడు. ఈ ఘటనలో స్వరూపకు తీవ్ర గాయమైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు దుర్గయ్యపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పాముకాటుతో అస్వస్థత

మంథని: ముత్తారం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం తెల్లవారుజామున నైట్ వాచ్‌మెన్ మేదరి రాజేశ్వరి పాముకాటుకు గురైంది. స్థానికులు ముత్తారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అందించాక కుటుంబసభ్యులు గోదావరిఖని తీసుకెళ్లారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



సత్యనారాయణ (ఫైల్)

కమాన్‌పూర్(మంథని): మండలంలోని జూలపల్లికి చెందిన బొడిగె సత్యనారాయణ గౌడ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సత్యనారాయణ గౌడ్ ట్రాలీ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా వాహనం నడపకపోవడంతోపాటు తాగుడుకు బానిసయ్యాడు. దీనికితోడు అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో గురువారం సాయంత్రం క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య నవ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ మస్తాన్ పేర్కొన్నారు.

‘పీఎం శ్రీ’కి ఐదు పాఠశాలలు

- పథకానికి రామగుండం, కమాన్‌పూర్, అప్పన్నపేట, ఎగ్లాస్‌పూర్, పొత్కపల్లి హైస్కూళ్లు ఎంపిక
- మౌలిక సదుపాయాల కల్పన
- విద్యార్థులకు అందనున్న డిజిటల్ విద్యాబోధన



రామగుండం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

రామగుండం: భావి భారత పౌరులను భవిష్యత్తు పోటీ ప్రపంచానికి సన్నద్ధం చేసే లక్ష్యంతో పీఎం శ్రీ(ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. నూతన జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా విద్యార్థులను మెరికలుగా తీర్చిదిద్దడమే దీని లక్ష్యం. పథకం కింద ఎంపికయ్యే హైస్కూళ్లకు 60:40 వాటాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను వెచ్చించనున్నాయి. పెద్దపల్లి జిల్లాలో కమాన్‌పూర్, అప్పన్నపేట, రామగుండం, ఎగ్లాస్‌పూర్, పొత్కపల్లి హైస్కూళ్లు పీఎం శ్రీ పథకానికి ఎంపికయ్యాయి.

ప్రత్యేకతలు ఇవీ..

పీఎం శ్రీ పథకంలో ఎంపికైన పాఠశాలలను ముందుగా కేంద్ర విద్యాశాఖ బృందాలు సందర్శిస్తాయి. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన, స్మార్ట్ తరగతి గదులు, డిజిటల్ గ్రంథాలయాలు, క్రీడా సదుపాయాలు, ఆర్ట్ గదులు ఏర్పాటు చేస్తారు. వీటితోపాటు నూతన జాతీయ విద్యావిధానంలో నిర్దేశించుకున్న ప్రమాణాలకు అనుగుణంగా పాఠశాలల్లో విద్యార్థులకు గుణాత్మక విద్య అందేలా చూస్తారు. ఆయా స్కూళ్లలో కేంద్రం రూపొందించిన ప్రత్యేక కరిక్యులమ్(సిలబస్) అమలు చేస్తారు. సౌర విద్యుత్ ఏర్పాటు, కూరగాయ తోటలు, ప్లాస్టిక్ రహిత చర్యలు, శుద్ధ జలం, ఇన్ఫర్మేటివ్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ) ల్యాబ్, ఇంటర్‌నెట్ సదుపాయం, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు.

చదువు పూర్తయ్యాక ఉపాధి..

పీఎం–శ్రీ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులను స్కూల్ దశ నుంచే వృత్తి విద్య కోర్సుల వైపు ప్రోత్సహిస్తారు. ఏదో ఒక రంగంలో డిగ్రీ పూర్తయ్యాక సదరు రంగంలో వారిని నిష్ణాతులుగా మారి, ఉపాధి పొందాలనేది నూతన విద్యావిధానం ప్రధాన ఉద్దేశం.

అధిక సంఖ్యలో ప్రవేశాలు..

కమాన్‌పూర్, అప్పన్నపేట, రామగుండం, ఎగ్లాస్‌పూర్, పొత్కపల్లి హైస్కూళ్లలో ఏటా ఆరో తరగతిలో విద్యార్థులు అధిక సంఖ్యలో ప్రవేశాలు పొందుతున్నారు. ఆయా పాఠశాలల్లో 300 నుంచి 500 మంది వరకు పిల్లలు చదువుకుంటున్నారు. క్రీడామైదానాలతోపాటు విద్యార్థులకు సరిపడా వాష్‌రూమ్స్ ఉన్నాయి. 20 నుంచి 26 మందికి వరకు టీచర్లు ఉన్నారు.

విద్యార్థుల అదృష్టం..



రామగుండం జిల్లా పరిషత్ హైస్కూల్ పీఎం శ్రీ పథకానికి ఎంపికవడం విద్యార్థుల అదృష్టం. టీచర్లు కూడా ఆనందంగా ఉన్నారు. మా పని విధానానికి ఇది నిదర్శనం. పథకంలో భాగంగా పలు పనులను త్వరలో ప్రారంభిస్తారని సమాచారం ఉంది. అన్ని రకాల మౌలిక వసతులు, ఆధునిక డిజిటల్ విద్యాబోధన అమలులోకి వచ్చిన తర్వాత విద్యార్థుల ప్రవేశాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలు తిరిగి జీవం పోసుకోనున్నాయి.

– తానం స్వర్ణ, హెచ్‌ఎం, రామగుండం హైస్కూల్

అరాచక పాలనను అంతమొందించండి

- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి
- పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు



కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులతో విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సారథ్యంలో సాగుతున్న అరాచక పాలనను అంతమొందించాలని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు పిలుపునిచ్చారు. పెద్దపల్లిలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన వార్డు సభ్యులు సాగర్, బూరం రాధ, కోట రేణుక, వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరగా పార్టీ కండువాలు కప్పి, ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి నియోజకవర్గ సహజ సంపదను దోచుకుంటున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ అరాచక పాలనను అంతమొందించాలని ప్రజలందరూ నిర్ణయించుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు పేదలందరికీ అందుతాయని పేర్కొన్నారు. నాయకులు గోపగాని సారయ్య, కొమ్ము శ్రీనివాస్, కడర్ల శ్రీనివాస్, భూషణవేన సురేష్ గౌడ్, భూతగడ్డ సంపత్, సయ్యద్ మస్రత్, బొడ్డుపల్లి శ్రీనివాస్, తూముల సుభాష్, పాల్సాని మల్లేశ్, కొమ్ము కరుణాకర్ పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించాలి

సుల్తానాబాద్(పెద్దపల్లి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించేందుకు కాంగ్రెస్ నాయకులు సిద్ధమవ్వాలని పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్‌లో శుక్రవారం రాత్రి గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. 10వ వార్డులో దర్గా నుంచి గాంధీనగర్, స్వప్న కాలనీ రహదారి వెంట భారీ ర్యాలీ చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, కేంద్రం పద్మశాలీలకు విధించిన జీఎస్టీని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, కొత్తగా ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు, నిరుద్యోగ యువతకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు అంతటి పుష్పలత, అన్నయ్య గౌడ్, మినుపాల ప్రకాశ్‌రావు, దన్నాయక్ దామోదర్‌రావు, సాయిరి మహేందర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్య గౌడ్, మండల అధ్యక్షుడు చిలుక సతీశ్, నాయకులు పాల్గొన్నారు.

సేవ చేసేవారికే ఓటు వేయండి

- బీఆర్‌ఎస్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి
- బీఎస్పీ రాష్ట్ర చీఫ్ కో–ఆర్డినేటర్ మంద ప్రభాకర్



మాట్లాడుతున్న ప్రభాకర్, పక్కన ఉష

జూలపల్లి(పెద్దపల్లి): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు చైతన్యవంతులై, తమ ఓటును ప్రజాసేవ చేసేవారికే వేయాలని బీఎస్పీ రాష్ట్ర చీఫ్ కో–ఆర్డినేటర్ మంద ప్రభాకర్ సూచించారు. జూలపల్లిలోని ఓ ఫంక్షన్ హాలులో శుక్రవారం నిర్వహించిన జూలపల్లి, ఎలిగేడు, సుల్తానాబాద్ మండలాల బూత్ కమిటీ ఇన్‌చార్జీల సమావేశానికి హాజరై, మాట్లాడారు. పెద్దపల్లి నియోజకవర్గంలో బీఎస్పీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

బీఎస్పీ జెండా ఎగరడం ఖాయం

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): బీఎస్పీ ఆర్గనైజేషన్ పరంగా పెద్దపల్లి నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందని, ఇక్కడ పార్టీ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ స్టేట్ చీఫ్ కో–ఆర్డినేటర్ మంద ప్రభాకర్ అన్నారు. కాల్వశ్రీరాంపూర్‌లో శుక్రవారం ఓదెల, కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాలకు చెందిన బూత్‌స్థాయి కమిటీల సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీని దీటుగా ఎదుర్కొనే శక్తి బీఎస్పీకి మాత్రమే ఉందన్నారు. ప్రజాబలం కోల్పోయిన అధికార పార్టీ వచ్చే ఎన్నికల్లో మద్యం, నోట్ల కట్టలతో గెలిచేందుకు వ్యూహరచన చేస్తోందని, బీఎస్పీ కార్యకర్తలు తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. సమావేశాల్లో పార్టీ ప్రధాన కార్యదర్శి దార్ల శివరాజ్, అధికార ప్రతినిధి సంజయ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి దాసరి హన్మయ్య, జిల్లా ఇన్‌చార్జి చంద్రశేఖర్, దాసరి ఉష, జూలపల్లి మండల ఇన్‌చార్జి సీపెల్లి కొమురయ్య, నాయకులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌కు మహిళా నాయకత్వం



బాధ్యతలు అప్పగిస్తున్న క్లబ్ ప్రతినిధులు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం లయన్స్ క్లబ్ తొలిసారి మహిళా నాయకత్వంలో సేవలందించేందుకు శ్రీకారం చుట్టింది. 2023–24 సంవత్సరానికి గాను ఏకగ్రీవంగా ఎన్నుకున్న మహిళా కార్యవర్గంతో గురువారం రాత్రి గోదావరిఖని శారదానగర్‌లో ప్రమాణస్వీకారం చేయించారు. క్లబ్ 52వ సంస్థాపన నూతన కమిటీకి ఎన్నికైన అధ్యక్షురాలు తానిపర్తి విజయలక్ష్మి, సెక్రటరీ బంక కళావతి, కోశాధికారి మనిషా అగర్వాల్, డైరెక్టర్లతో డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ రేకులపల్లి విజయ ప్రమాణస్వీకారం చేయించారు. మహిళా అభివృద్ధి, ఆర్థిక సాధికారతకు కృషి చేయాలని సూచించారు. డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్లు మనీష్ టాండన్, ప్రమోద్ కుమార్ రెడ్డి, కో–చైర్మన్ తిలక్ చక్రవర్తి, డిస్ట్రిక్ట్ క్యాబినేట్ సెక్రటరీ వెంకట రమణారెడ్డి, కోశాధికారి రాజేంద్రప్రసాద్, రీజియన్ చైర్‌పర్సన్ అశోక్, జోన్ చైర్‌పర్సన్ లావణ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాజేందర్ తదితరులున్నారు.

బొగ్గుబాయి వార్తలు

రక్షణతో బొగ్గు ఉత్పత్తి సాధించాలి

- ఆర్జీ–2 జీఎం మనోహర్



మైన్ ప్లాన్ పరిశీలిస్తున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): రక్షణతో బొగ్గు ఉత్పత్తి సాధించాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ అన్నారు. శుక్రవారం వకీల్‌పల్లి గనిని సందర్శించి, బొగ్గు ఉత్పత్తిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మైన్ ప్లాన్ పరిశీలించి, 3 సీంటాప్ సెక్షన్‌లో ఎల్‌హెచ్‌డీ ఉత్పత్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందుగా రూఫ్ సేఫ్టీ సపోర్టు చేసిన తర్వాతే బొగ్గు ఉత్పత్తిపై దృష్టి సారించాలని చెప్పారు. వార్షిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని సూచించారు. జీఎం వెంట ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి, గని మేనేజర్ రవికిరణ్, గ్రూప్ ఇంజినీర్ చంద్రశేఖర్, సర్వే అధికారి అప్సర్ పాషా, సంక్షేమాధికారి ఓంకారిబాబు తదితరులున్నారు.

సింగరేణి బకాయిలు వెంటనే చెల్లించాలి

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సత్తయ్య

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థకు రావాల్సిన రూ.25 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్జీ–1 ఏరియా జీడీకే–2వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బీఎంఎస్ కృషి ఫలితంగానే మంచి వేతన ఒప్పందం జరిగిందన్నారు. బొగ్గు గని కార్మికుల భవిష్య నిధిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు, అవినీతికి తావు లేకుండా మెరుగైన సేవలందించేందుకు నిర్ణయం జరిగిందని పేర్కొన్నారు. జూలై 12 నుంచి దేశవ్యాప్త బొగ్గు గని కార్మికులకు ఆన్‌లైన్ పద్ధతి ద్వారా మెరుగైన సేవలు అందించడానికి కృషి చేశామన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో సంస్థ పరంగా వచ్చిన వాస్తవ లాభాలపై 35శాతం వాటా చెల్లించాలని కోరారు. ఏరియా ఉపాధ్యక్షుడు ఆకుల హరిణ్, కేంద్ర ఉపాధ్యక్షుడు వై.సారంగపాణి, కేంద్ర కమిటీ సభ్యులు మాదాసి రవీందర్, పెంచాల వెంకటస్వామి, ఎల్లావుల కోటయ్య, పోతరబోయిన విజయ్‌కుమార్, పోలు యాదగిరి, ఎర్రవెల్లి రమేశ్, ఆరెల్లి వెంకటరాజం, ఆకుల కోటేశ్ పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం



చెత్త తొలగిస్తున్న అధికారులు

కమాన్‌పూర్(రామగిరి): ఆర్జీ–3 పరిధిలోని సెంటినరీకాలనీలో స్వచ్ఛత పక్షోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం అధికారులు పరిసరాల పరిశుభ్రతపై కార్మిక కుటుంబాలకు అవగాహన కల్పించారు. కాలనీలో చెత్తాచెదారం తొలగించారు. ఈ సందర్భంగా ఏరియా సర్వే అధికారి జైనులాబద్దీన్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి పర్యావరణ అధికారి సత్యనారాయణ, సర్వే అధికారి వెంకటేశ్వర్లు, సివిల్ సూపర్‌వైజర్ యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సర్వే జీఎంకు సన్మానం



గోవర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): కార్పొరేట్ సర్వే జీఎం గోవర్ధన్‌రెడ్డిని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ శుక్రవారం సన్మానించారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. గోవర్ధన్‌రెడ్డి ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందనున్నారు. ప్రాజెక్టు అధికారి మధుసూదన్, శ్రీనివాస్‌రెడ్డి, రక్షణ అధికారి బి.రవీందర్, ఏరియా ఇంజినీర్ నరసింహారావు, డీజీఎం పర్సనల్ జి.రాజేంద్రప్రసాద్, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, ప్రాజెక్టు ఇంజినీర్ దుర్గాప్రసాద్, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, డీజీఎం స్టోర్స్ సుజన్ మెహ్రా, సెక్యూరిటీ అధికారి పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో..

కమాన్‌పూర్(రామగిరి): ఆర్జీ–3 లో జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.గోపాల్‌రెడ్డి ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందుతున్న నేపథ్యంలో జీఎం కార్యాలయంలో శుక్రవారం ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు ఆయనను సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో అధికారులు బైద్య, రఘుపతి, జైనులాబద్దీన్, రమేశ్, వెంకటరమణ, విలాస్ శ్రీనివాస్ పోద్దార్, పద్మరాజు, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టోర్స్ పనితీరుపై సమీక్షా సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

గోదావరిఖని(రామగుండం): స్టోర్స్ పనితీరుపై శుక్రవారం రామగుండం రీజియన్‌లోని ఆర్జీ–1, 2, 3 అధికారులతో గోదావరిఖనిలోని జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్పొరేట్ స్టోర్స్ జీఎం చిన్న బస్విరెడ్డి, ఆర్జీ–2 జీఎం మనోహర్ పలు అంశాలపై చర్చించారు. ప్రతీ స్టోర్ ఇన్‌చార్జి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరాలు వెల్లడించారు. పెట్రోల్ బంకులు, ఎక్స్‌ప్లోజివ్ మ్యాగ్జిన్లు, స్టోర్స్ నుంచి గనులకు డిపార్ట్‌మెంట్ మెటీరియల్ పంపిణీ, రవాణా తదితర విషయాలపై చర్చించి, పలు సూచనలు చేశారు. రామగుండం రీజియన్ ఏరియా, ప్రాజెక్టు, గ్రూప్, స్టోర్స్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

అన్ని సంఘాలతో చర్చించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని(రామగుండం): సింగరేణిలో అన్ని ఎన్నికలు రద్దు చేసి, అన్ని సంఘాలతో చర్చించాలని ఏఐటీయూసీ ఆర్జీ–1 బ్రాంచి కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కన్వీనర్ ఆరెల్లి పోషం డిమాండ్ చేశారు. శుక్రవారం గోదావరిఖనిలోని భాస్కర్‌రావు భవన్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. టీబీజీకేఎస్ వల్ల కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. యాజమాన్యం గుర్తింపు యూనియన్‌తో జతకలిసి, ఎన్నికలు జరగకుండా అడ్డుకుంటోందని ఆరోపించారు. నాయకులు మాదన మహేశ్, సంకె అశోక్, మిట్ట శంకర్, కనవేణి బాలయ్య, పెర్క మహేందర్, మానాల శ్రీనివాస్, కలవేణి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణ తొలగింపునకు అధికారుల రాక

- అడ్డుకొని, ఆత్మహత్యాయత్నం చేసిన బాధితుడు
- పరిస్థితి ఉద్రిక్తం
- వెనుదిరిగిన అధికారులు
- మంథని సత్యసాయి నగర్‌లో ఘటన





ఒంటిపై కిరోసిన్ పోసుకున్న భీమయ్య, ఇంటి వద్ద టాస్క్‌ఫోర్స్ బృందం

మంథని: మంథని మున్సిపాలిటీ పరిధిలోని సత్యసాయి నగర్‌లో అక్రమ నిర్మాణాన్ని తొలగించేందుకు అధికారులు వచ్చారు. దీంతో వారికి బాధిత కుటుంబసభ్యులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకొని, ఉద్రిక్తతకు దారితీసింది. వివరాలిలా ఉన్నాయి.. సత్యసాయి నగర్‌లోని మున్సిపల్ లీజు స్థలంలో వడ్లకొండ భీమయ్య పక్కా భవనం నిర్మించుకున్నాడని అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. సదరు నిర్మాణాన్ని తొలగించాలని న్యాయస్థానం నుంచి ఆదేశాలు రావడంతో మున్సిపల్ కమిషనర్ శారద, టీపీవో యశ్వంత్‌కుమార్ నాలుగు రోజుల క్రితం వచ్చి, నోటీసు ఇచ్చారు. అయితే భీమయ్య భవనాన్ని తొలగించుకోక పోవడంతో శుక్రవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందంలోని మున్సిపల్ కమిషనర్, టీపీవోతోపాటు మంథని ఇన్‌చార్జి తహసీల్దార్ గిరి, ఎస్సై రాణి వర్మ, ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ సదానందం, ఆర్‌అండ్‌బీ, పోలీస్, ఇతర శాఖల సిబ్బంది శుక్రవారం పెద్ద ఎత్తున సత్యసాయి నగర్‌కు చేరుకున్నారు. వారిని గమనించిన భీమయ్య కుటుంబసభ్యులు నిర్మాణం వైపు వెళ్లకుండా అడ్డుకున్నారు. మున్సిపల్ పరిధి లీజు భూముల్లోని నిర్మాణాలను తొలగిస్తే తాము స్వచ్ఛందంగా తొలగించుకుంటామని తేల్చిచెప్పారు. తమ ఇంటిని మాత్రమే ఎందుకు తొలగిస్తారని ప్రశ్నించారు. రాజకీయ కక్షతోనే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. భీమయ్య తన ఒంటిపై కిరోసిన్ పోసుకొని, నిప్పంటించుకునే ప్రయత్నం చేశాడు. అధికారులు అతన్ని పక్కకు తీసుకెళ్లి నీళ్లు పోశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

మరమ్మతు చేసుకుంటే తొలగిస్తారా?

40 ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నామని, మున్సిపాలిటీకి లీజు డబ్బులు కూడా చెల్లిస్తున్నామని భీమయ్య తెలిపాడు. తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న నిర్మాణం శిథిలావస్థకు చేరడంతో మరమ్మతు చేసుకుంటున్నామని చెప్పాడు. తమను ఓ వ్యక్తి డబ్బులు డిమాండ్ చేయడంతో ఇవ్వలేదని, అందుకే ఫిర్యాదు చేశాడని ఆరోపించాడు. చాలా మంది పక్కా నిర్మాణాలు చేశారని, తాజాగా మూడు చోట్ల నిర్మించారని, వాటిని తొలగించిన తర్వాత తన వద్దకు రావాలని కోరాడు.

హైకోర్టు ఆదేశాల మేరకే..

మున్సిపల్ స్థలంలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలని హైకోర్టు నుంచి ఆదేశాలు రావడంతో వారం క్రితమే కూల్చివేసేందుకు వచ్చామని మున్సిపల్ కమిషనర్ శారద తెలిపారు. కానీ తామే తొలగించుకుంటామని వారు బతిమిలాడటంతో నోటీసు ఇచ్చి, వెళ్లిపోయామన్నారు. ఆ తర్వాత తొలగించకపోవడంతో జిల్లా టాస్క్‌ఫోర్స్ టీంతో కలిసి వచ్చామని, తమ విధులను అడ్డుకోవడమే కాకుండా ఒంటిపై కిరోసిన్ పోసుకోవడంతో తిరిగివచ్చామని పేర్కొన్నారు.

నేడు ‘ట్రినిటీ’లో ఆన్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటీ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం 20 పైగా జాతీయ కంపెనీలతో ఆన్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. శుక్రవారం బ్రోచర్ ఆవిష్కరించి, మాట్లాడారు. బీటెక్, ఎంబీఏ ఉత్తీర్ణులైన వారితోపాటు ఈ ఏడాది పరీక్షరాసిన విద్యార్థులు రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొనాలని పేర్కొన్నారు. 6 సెట్ల ధ్రువ పత్రాలు తీసుకురావాలన్నారు. కాలేజీలో చదివిన ప్రతీ విద్యార్థికి ఉద్యోగాలు కల్పించాలన్న ఉద్దేశంతో చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రిన్సిపాల్ మణిగణేశన్, ఏవో సురేష్, హెచ్‌ఓడీలు, మేనేజ్‌మెంట్ రిప్రజెంటేటివ్ రాజిరెడ్డి పాల్గొన్నారు.